
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
సోమవారం 1 డిసెంబర్ 2025 పేజీలు 8







# వర్షంతో ఆందోళనలో రైతాంగం

ధాన్యపు రాశులపై పరజాలు కప్పి రక్షించుకునే ప్రయత్నం

హడావుడిగా వరికుప్పలు వేసి పరజాలు కప్పిన వైనం

వివరాలు 2లో

## మైదాన ప్రాంత గిరిజనుల హక్కుల సాధనకై ఉద్యమిద్దాం




వివరాలు 8లో



## 11 నుంచి
# భవాని దీక్షల విరమణ

- 15న మహా పూర్ణాహుతితో ముగియనున్న కార్యక్రమాలు
- ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం
- ఇంద్రకీలాద్రి పరిసర ప్రాంతాలను పరిశీలించిన సీపీ

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ది.11.12.2025 నుండి ప్రారంభమయ్యే భవాని దీక్షల విరమణ కార్యక్రమం ది.15.12.2025న జరిగే మహా పూర్ణాహుతి కార్యక్రమంతో ముగుస్తుంది. రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు అమ్మవారి మాలాధారణ చేసి దీక్షా విరమణ కోసం విజయవాడకు వస్తారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, పోలీస్ అధికారులతో కలిసి టెంపుల్ పరిసర ప్రాంతాలను, గిరి ప్రదక్షణ ప్రాంతాన్ని, స్నాన ఘాట్లను హోమగుండాలు, విరుముడుల స్టాండ్ల ఏర్పాటు, ప్రదేశాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. గిరిప్రదక్షణ సందర్భంగా ట్రాఫిక్ మిగతా 2లో...

## ప్రశాంతంగా ముగిసిన యూపీఎస్సీ ఈపీఎఫ్వో పరీక్ష

- 37.25 శాతం హాజరు నమోదు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్/అకౌంట్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆదివారం నిర్వహించిన ఈపీఎఫ్వో పరీక్ష – 2025 ప్రశాంతంగా ముగిసింది. ఉద్యోగ భవిష్య నిధి సంస్థలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం నగరంలో 15 కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా 5,860 మంది అభ్యర్థులకుగాను 2

(మొదటిపేజీ తరువాయి)

### ప్రశాంతంగా ముగిసిన యూపీఎస్సీ ఈపీఎఫ్వో పరీక్ష



2,183 మంది (37.25 శాతం) హాజరయ్యారు. కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ లోని సీవీఆర్ ఉన్నత పాఠశాల, చిట్టూరి హైస్కూలు, ప్రభాస్ పీజీ కళాశాల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన లైజనింగ్ అధికారులు, వెన్యూ సూపర్వైజర్లు, సమన్వయ శాఖల అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు.

### 11 నుంచి భవాని దీక్షల విరమణ



అంతరాయం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లపై సూచనలు చేయడంతో పాటు, దర్శన సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. క్యూలైన్లను, దర్శనం అనంతరం భక్తులు వెళ్లే మార్గాలను కూడా పరిశీలించి పటిష్ట మైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సారి భవాని దీక్షా విరమణను అత్యుత్తమంగా నిర్వహించేందుకు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండే విధంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఎటునుంచి వచ్చిన భక్తులైనా ఒకే సమయానికి అమ్మవారి ధర్శనం చేసుకునేలాగా ఏర్పాట్లపై చర్చించారు, అదేవిధంగా భవాని భక్తుల సౌకర్యార్థం రెండు ఫుట్ బ్రిడ్జ్ ల ఏర్పాటుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్, డి.సి.పి.లు కృష్ణ కాంత్ పాటిల్, షీరిన్ బేగం, ఏ.సి.పి.లు, డి.పావన్ కుమార్, రామ చంద్రరావు, ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రామీణ పిల్లలకు కొత్త దారి చూపుతున్న బేయర్ ప్రయత్నం



**విజయవాడ మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల పిల్లల జీవితాల్లో మార్పు తీసుకు రావాలనే లక్ష్యంతో బేయర్ సంస్థ 'మేక్ దెమ్ షైన్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది సామాజిక బాధ్యతలో భాగంగా చేపట్టిన వినూత్న ప్రయత్నంగా నిలుస్తోంది. పిల్లల ప్రతిభకు అడ్డంకులుగా మారుతున్న పరిస్థితులను దాటిచెళ్లేలా ఈ కార్యక్రమం రూపొందింది. అనుభవాత్మక విద్య ద్వారా పిల్లల్లో నమ్మకం పెంచడమే ప్రధాన ఉద్దేశంగా ఉంది. సాంప్రదాయ బోధన పద్ధతులకంటే భిన్నంగా, పిల్లలు స్వయంగా అనుభవించడం ద్వారా నేర్చుకునే విధానాన్ని అమలు చేస్తున్నారు. భావోద్వేగ వికాసానికి యోగా, అనుసంధాన శిక్షణల ద్వారా మానసిక బలాన్ని పెంచుతున్నారు. ఇది పిల్లలలో స్థిరత్వాన్ని పెంచుతోంది. ఇంటిగ్రేటర్ ఫౌండేషన్‌తో కలిసి రెండు వారాల శిక్షణా కార్యక్రమాన్ని క్రమబద్ధంగా నిర్వహిస్తున్నారు. మొదటి విడతగా వంద మంది పిల్లలను ఎంపిక చేసి వివిధ అభ్యాస కార్యక్రమాల్లో పాల్గొనిస్తున్నారు. ఉత్తమంగా రాణించిన పిల్లలకు గుర్తింపు కల్పించి ప్రోత్సహించనున్నట్లు బేయర్ వెల్లడించింది.

# వర్షంతో ఆందోళనలో రైతాంగం...





### ధాన్యపు రాశులపై పరజాలు కప్పి రక్షించుకునే ప్రయత్నం

### హడావుడిగా వరికుప్పలు వేసి పరజాలు కప్పిన వైనం

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** దిత్వా తుఫాను రైతులను కలవరపెడుతోంది. తుఫాను ప్రభావం తో వర్షాలు కురుస్తాయనే వార్తలతో వరికోత యంత్రాలతో వరికోతలు గ్రామాల్లో ముమ్మరంగా సాగుతుండటంతో గ్రామాల్లో ఎటుచూసినా ధాన్యపురాశులే దర్శనమిస్తున్నాయి. పచ్చిగా ఉన్న ధాన్యం కావటంతో జాతీయ రహదారిపై, గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో ధాన్యపురాశులు పోసి ఆరబెట్టుకున్నారు. తేమశాతం 23వరకు ఉన్న ధాన్యాన్ని ప్రథమ ప్రాధాన్యతగా అధికారులు దగ్గరుండి కొనుగోలు చేయించి రైస్ మిల్లులకు తరలిస్తున్నప్పటికీ గ్రామాల్లో ధాన్యపు రాశులు పెద్దఎత్తున ఉన్నాయి. ఆదివారం వాతావరణంలో మార్పులు సంభవించి వర్షం పడుతుండటంతో రైతన్నలో ఆందోళన నెలకొంది. ఉదయం నోటితుపరగా చిరుజల్లులు అక్కడక్కడా పడినప్పటికీ మధ్యాహ్నం నుంచీ చిన్నగా వర్షం పడుతూ ఉంది. సోమవారం, మంగళవారం సైతం వర్షాలు ఉన్నాయనే వార్తల నేపథ్యంలో రైతాంగం కలవరపాటుకు గురవుతున్నారు. కోతలు పూర్తయి పనలమీదున్న వారిని హడావుడిగా కుప్పలు వేసుకుని పరజాలు కప్పుకుని పంటను రక్షించుకున్నారు.

మరికొన్ని చేలలో వరిపంట పనలమీదుంది. వర్షం పెరిగి పెద్దదైతే పనలు తడిచి పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమశాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని జాతీయ రహదారిపై పెద్దఎత్తున ఆరబోసుకోగా, ఆరిపోయిన ధాన్యాన్ని బస్తాలకు ఎత్తి లాటులు కట్టి ఉంచారు. వర్షం నుంచీ కాపాడుకునేందుకు ధాన్యపు రాశులు, బస్తాలపైనా పరజాలు కప్పుకున్నారు. దీంతో గ్రామాల్లో ఎటుచూసినా పరజాలు కప్పిన ధాన్యపురాశులు, ధాన్యపుబస్తాలు కనిపిస్తున్నాయి.

# వర్షపు జల్లులలోనే వరి కోతలు





**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్:** ఆదివారం ఉదయం నుంచి దిత్వా తుఫాను ప్రభావంతో మబ్బులు కమ్ముకొనివర్షపు జల్లులు పడుతుండగారైతులు హడావుడిగా వరి కోతలు కోయించడంలో నిమగ్నమైనారు. ఓ మాదిరిగా గాలులు, వర్షపుజల్లులు పడటం వల్ల రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామంలో జన్మభూమి రోడ్డుపైన కోసిన పంటను అరబెట్టారు. రహదారుల పక్కన ఆరబెట్టుకున్న ధాన్యంపై తుఫాన్ భయంతో పరదాలు కప్పుకున్నారు. వరి పైరుకు అధిక కూలీ చెల్లించి, కోత మిషన్ తో పంటను కోపించి ఊపిరి పీల్చుకున్నారు. దయచేసి కూటమి ప్రభుత్వం తుఫాన్ ప్రభావం వల్ల కోసిన వరీ పంట తడవకుండా రైతు సేవకేంద్రం ద్వారా తరుబల్ పట్టాలను సహాయంగా అందిస్తే బాగుంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు కుందేటి అగస్టీన్,గజ్జగంటి పొలురాజు, తోడేటి సువర్ణరాజు,సొంగ దయాకర్, పసునూరి రంగా తదితరులు పాల్గొన్నారు.

## అధికార యంత్రాంగం రైతులకు అనునిత్యం అందుబాటులో ఉంది







**కోడూరు మేజర్ న్యూస్ :** దిత్వా తుఫాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం రైతులకు అనునిత్యం అందుబాటులో ఉండి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ తెలిపారు. ఆదివారం వెంకట్రామ్ కోడూరు, లింగారెడ్డిపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, సంత మార్కెట్ ఆవరణలోని గోడౌన్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, సొసైటీ చైర్మన్లు, నాయకులు, మిల్లరుతో మాట్లాడి క్షేత్ర స్థాయి పరిస్థితిని పరిశీలించారు. కోడూరులో ఒకే రైస్ మిల్లు ఉండటంతో అదనంగా తూర్పు గోదావరి జిల్లా నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు వచ్చిన మిల్లర్ ప్రతినిధి శాస్త్రితో మాట్లాడి వారి నుంచి రైతులకు అందించే సహకారంపై చర్చించారు. ప్రభుత్వం జీపీఎస్ నిబంధనకు ఉపశమనం ఇచ్చిన నేపథ్యంలో పెరిగిన వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని వెంకట్రామ్ మిల్లరును కోరారు. కోడూరు మండలంలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసిన నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది నిరంతర పర్యవేక్షణతో సాధ్యమైనంత వేగంగా ధాన్యం మొత్తం మిల్లులకు తరలించే ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. రైతులు అవసరమైతే, సంత మార్కెట్ వద్ద ఉన్న గోడౌన్ వాడుకోవాలని సూచించారు.

### రైతు సేవా కేంద్రం ద్వారానే అమ్మండి

తుఫాన్ నేపథ్యంలో ధాన్యానికి ధర రావట్లేదనే అపోహలను రైతులు నమ్మవద్దని సూచించారు. రైతులు తొందరపడి వ్యాపారులు, దళారుల వద్దకు వెళ్లి తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దని సూచించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రతి రైతుకు ప్రభుత్వ మద్ధతు ధర దక్కేలా రెవిన్యూ అధికారులు, సొసైటీ ప్రతినిధులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు,వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిరుపతి శ్రీనివాసరావు, ఇంచార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, పీఏసీఎస్ చైర్మన్లు పూతబోయిన కరుణ కుమార్, కోట సుబ్బారావు, జనసేన టౌన్ అధ్యక్షులు కోట రాంబాబు, జనసేన పార్టీ నాయకులు కొల్లి వెంకటేశ్వరరావు (చినబాబు), కాగిత రామారావు, జరుగు ఆదినారాయణ, జరుగు పోతురాజు, కోట ప్రసాద్, జరుగు లక్ష్మణ, అప్పికట్ల అంకబాబు, సొసైటీ సీఈఓలు అర్జా వెంకట నగరాయలు, చిట్టిప్రోలు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్‌లకు, సస్పెక్ట్‌లకు కౌన్సిలింగ్

సెంట్రల్ జోన్ పరిధిలోని రౌడీషీటర్‌లకు, సస్పెక్ట్‌లకు స్వయంగా కౌన్సిలింగ్ నిర్వహించిన డి.సి.పి కృష్ణ కాంత్ పాటిల్





**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు డి.సి.పి.లు కృష్ణ కాంత్ పాటిల్, బి.లక్ష్మీ నారాయణ్ణ ఆధ్వర్యంలో ఏ.సి.పి., పోలీసు కమిషనరేట్ పరిదిలోని అన్నీ పోలీసు స్టేషన్ల, టాస్క్ ఫోర్స్ కార్యాలయాలలో ఆదివారం ఆయా పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ లకు, లా & ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్ లకు, చెడునడత కలి గిన వ్యక్తులకు వివిధ సమయాలలో కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఈ క్రమంలో సెం ట్రల్ ఏ.సి.పి.కార్యాలయంలో సెంట్రల్ జోన్ పరిధిలోని రౌడీషీటర్‌లకు, సస్పె క్ట్‌లకు ఈస్ట్ జోన్ డి.సి.పి. కృష్ణ కాంత్ స్వయంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్ప డకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రామాలలో పాల్గోవడం చేయరాదని, ఎవరైనా చ ట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీ సుకోవడం జరుగుతుందని, అంతేకాకుండా గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవ్వరైనా ఎక్కడైనా గొడవలు ఇతర నేరాలలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.





## చురుగ్గా రహదారి అభివృద్ధి పనులు

### పరిశీలించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



**మైలవరం మేజర్ న్యూస్ :** మైలవరం నుంచి వెల్వడం, చంద్రాల గ్రామం వరకు బ్లాక్ టాప్ తారు రహదారి అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వెల్వడం గ్రామంలో పేరంటాలమ్మ గుడివద్ద ఈ పనులను స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఇందుకు గాను ఆర్ అండ్ బి నుంచి రూ.6 కోట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఈ బీటీ రహదారి అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇచ్చి కృషి చేసినట్లు వెల్లడించారు. రహదారి అభివృద్ధి పనులు నాణ్యతతో జరుగుతున్నట్లు పేర్కొన్నారు. చంద్రబాబు రింగ్ వద్ద ఉన్న గోతులు కూడా పూడ్చి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. మైలవరంలో అంబేద్కర్ విగ్రహాల దగ్గర నుంచి ఎస్సీ ఏరియా చివరి వరకు కూడా తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలని టీడీపీ నాయకులు మైక్ బాబూరావు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ) ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు అవనిగడ్డలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత సమావేశం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** జాతీయ కాంగ్రెస్ పార్టీ సంఘటన్ శ్రీజన్ అభియాన్ పేరిట సంస్థాగత నిర్మాణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అందే శ్రీరామ్మూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ లంకమ్మ మాన్యం సమీపంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఏఐసీసీ సెక్రెటరీ సంజయ్ దత్, పీసీసీ ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాష్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల ఎలిజా, ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు భారీగా తరలి రావలసిందిగా శ్రీరామ్మూర్తి కోరారు.

## వర్షపు జల్లులలోనే వరికుప్పలు

**మొవ్వ మేజర్ న్యూస్ :** ఆదివారం ఉదయం నుంచి దిత్వా తుఫాను ప్రభావంతో మబ్బులు కమ్ముకొని వర్షపు జల్లులు పడుతుండగా రైతులు హడావుడిగా వరి కుప్పలు



వేయించుకోవడంలో నిమగ్నమైనారు. ఓ మాదిరిగా గాలులు, వర్షపు జల్లులు పడటం ప్రారంభించాయి. గ్రామాలలో ఆరుబయట ప్రాంతాలలో, రహదారుల



పక్కన ఆరబెట్టుకున్నధాన్యంపైనే కాకుండా ధాన్యం బస్తాల నెట్లపైపరదాలు కప్పించుకొన్నారు. అలాగే పనలమీద ఉన్నవరిపైరుకు అధిక కూలీ చెల్లించి కట్టివేత కట్టించి కుప్పలు వేయించుకుని ఊపిరి పీల్చుకున్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సహాయం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సహాయం అందచేశారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరంలోని కుమ్మర్ల బజారులో యర్రారపు వీరాంజనేయులు తన కుటుంబంతో నివసించే పూరిల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఆదివారం బాధిత కుటుంబాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డిస్ట్రిక్ట్ చైర్మన్ డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ పరామర్శించి, వ్యక్తిగతంగా రూ.5వేలు ఆర్థిక సహాయం అందచేశారు. చల్లపల్లి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ స్టీల్ సామాగ్రి సెట్, హెవీ టార్పాలిన్, బియ్యం, సరుకులను సబ్ బ్రాంచ్ చైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర డీ.ఆర్.కే ప్రసాద్ చేతులమీదుగా అందచేశారు. కార్యక్రమంలో సబ్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు పేరం మధుసూధనరెడ్డి, ప్రతినిధులు ఆకురాతి హరిప్రసాద్, బళ్లా మధు, ట్రెజరర్ ఎండీ.ఏ.కే.జిలాని పాల్గొన్నారు.

## హనుమ ఆదరణ కూడికలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు టౌన్ చాట్లవానిపురంలో జరిగిన చాట్ల హనుమ ఆదరణ కూడికలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు చాట్ల రమేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుబ్బారావు భౌతికకాయానికి ఎమ్మెల్యే నివాళి



**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని యలకుర్రు గ్రామంలో తుమ్మల సుబ్బారావు మృతిచెందగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాంబాబు చిత్రపటానికి నివాళులర్పించిన వర్ల, వీరంకి



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని తోట్లవల్లూరు గ్రామంలో ఆదివారం జరిగిన తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరంకి సీతా రాంబాబు పెద్దకర్మ కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారాంబాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పైడికొండలపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన ధర్మవరపు వెంకటేశ్వరరావు పెద్దకర్మ కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో ఆర్థిక సహాయం అందించిన టీడీపీ నాయకులు



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వెంట్రప్రగడ గ్రామానికి చెందిన పెదపూడి వెంకటేశ్వరరావు (టమాటా) మృతి చెందగా తెలుగుదేశం పార్టీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి పి-4 పథకం ద్వారా రాచూరి ప్రభుదాసు సమకూర్చిన 5వేల రూపాయలు నగదును పార్టీ నాయకులు కుటుంబ సభ్యులకు అందజేశారు. స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదేశాల మేరకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, స్థానిక పిఎసిఎస్ అధ్యక్షులు కూచిపూడి వెంకట సుబ్బారావు (సుబ్బయ్య), పార్టీ నాయకులు విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ద్విత్వ తుఫాను కారణంగా మీ కోసం రద్దు

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వచ్చే డిసెంబర్ 1వ తేదీ సోమవారం కలెక్టరేట్లో జరగవలసిన మీ కోసం – ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్విత్వ తుఫాను కారణంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ద్విత్వా తుఫాను ముందస్తు జాగ్రత్త పనులలో జిల్లా అధికారులందరూ నిమగ్నమై ఉన్నందున మీకోసం కార్యక్రమం నిర్వహించడం లేదని కలెక్టర్ వివరించారు. జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా నగరంలోని కలెక్టరేట్లో అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కావున జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించవలసినదిగా జిల్లా కలెక్టర్ కోరారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతుల స్వీకరణ

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**విజయవాడ, మేజర్ న్యూస్ :** డిసెంబర్ 1వ తేదీ సోమవారం కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం... పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్లో నమోదు చేసుకోవచ్చని.. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

## పాములపాడు వద్ద వంతెన తాత్కాలిక మరమ్మతులకు ఐదు లక్షలు మంజూరు



**పెడపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పాములపాడు వద్ద దోసపాడు ఛానల్ పై గల వంతెన ఇటీవల కూలిపోవడంతో తాత్కాలిక మరమ్మత్తులకు ఐదు లక్షల రూపాయలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మంజూరు చేశారని ఎంపీపీ గోగం సురేష్ తెలిపారు. మచిలీపట్నంలో ఎంపీపీ గోగం సురేష్ వినతి పత్రాన్ని కలెక్టర్ బాలాజీ కి అందజేయగా ఆయన స్పందించి తాత్కాలిక మరమ్మత్తులకు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేశారని, నూతన వంతెన నిర్మాణం కోసం అంచనాలు రూపొందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పంపించామని కలెక్టర్ తెలిపారని సురేష్ చెప్పారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపుతో గన్నవరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ఆదేశాల మేరకు మండలంలోని నున్న గ్రామంలో ఆదివారం, గ్రామ వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు పోలారెడ్డి చంద్రా రెడ్డి,మాజీ ఎంపీపీ యార్లగడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా చదువుకునే విద్యార్థులు, యువకులు గ్రామంలో అనేక మంది స్వచ్ఛందంగా వచ్చి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెద్దలు, బీమవరపు ముత్తా రెడ్డి,మాజీ సర్పంచ్ కత్రి విజయ్ కుమార్, దండు సుబ్రమణ్య రాజు,బీమవరపు శివరామ రెడ్డి, నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

# కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకు సాగాలి




**చల్లపల్లి మేజర్ న్యూస్ :** కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకు సాగాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే వి వి ప్రసాద్ పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కే వి వి ప్రసాద్ మాట్లాడుతూ పార్టీని, అనుబంధ సంఘాల ను బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీల ప్రాబల్యం చూపాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్న సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకొని కమ్యూనిస్టు పార్టీల ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజల పక్షాన పోరాటాలు చేయాలని కమ్యూనిస్టు పార్టీ శ్రేణులకు హితబోధ చేశారు. ప్రస్తుతం అన్నదాత పరిస్థితి దయనీయంగా ఉందని, పంటలకు గిట్టుబాటు ధరలు రాక రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలపై ఈనెల 10వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. జనవరి 18వ తేదీన తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం లో జరగబోయే సిపిఐ శతాబ్ది ఉత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ సంవత్సరాల ఉత్సవానికి పార్టీ శ్రేణులు వేలాదిగా తరలిరావాలని కే వి వి ప్రసాద్ సూచించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. అవనిగడ్డ నియోజకవర్గ కార్యదర్శి గుత్తికొండ రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెలగపూడి ఆజాద్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ బాబులు ప్రసంగించగా ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాట్రగడ్డ రామచంద్ర జోషి, చెరుకు శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ లంక నాగమల్లి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కుంపటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పోటీలకు ఎంపికైన మండల జట్ల వివరాలు



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఉపాధ్యాయులకు పోటీలను నిర్వహించి మండల టీమ్లను ఎంపిక చేసినట్లు ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు మహిళ ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను నిర్వహించారు అనంతరం పురుషుల మండల స్థాయి క్రికెట్ జట్టును అలాగే మహిళల రూపాలు మండల జట్టును ఎంపిక చేశారు ఎంపికైన ఈ జట్లు డివిజన్ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటాయి. పురుషుల మండల క్రికెట్ జట్టుకు అగినపర్రు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బొప్పన శ్రీనివాసరావు, అదే పాఠశాలకు చెందిన జి. రామాంజనేయులు, వి.సుబ్రహ్మణ్యం, మేడూరు పాఠశాలకు చెందిన పి.నాగరాజు, బి.శ్రీనివాస్, పి.నాగార్జున, బి.రవి శంకర్ కుమార్, ఎ.బాలాజీ, పమిడిముక్కల పాఠశాలకు చెందిన డి.వీరాంజనేయులు, ఎం.పున్నంరాజు, అబ్దుల్ అలీం, ఎ.రాంబాబు, ఐనపూరు పాఠశాలకు చెందిన బి.ఎన్.వి.సత్యనారాయణ, ముత్రాసుపాలెం నుండి కె.అనిల్, ముళ్ళపూడి నుండి ఆర్.పార్థసారథి ఎంపికయ్యారు. కాగా ఈ జట్టుకు ఫిజికల్ డైరెక్టర్లు సిహెచ్. సుధాకర్ కోచ్ గాను, వేముల వెంకటేశ్వరరావు మేనేజర్ గా వ్యవహరించనున్నారు. అలాగే మండల మహిళా ఉపాధ్యాయుల త్రోబాల్ జట్టుకు కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తులసీరాణి, అదే పాఠశాలకు చెందిన జి.లలిత, ఆ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలకు చెందిన వెంకటేశ్వరమ్మ, కె.మాధవి, తాడంకి పాఠశాలలకు చెందిన కె.రామరత్నకుమారి, కె.రాజేశ్వరి, డి.సంగీత, సిహెచ్.దుర్గాభవాని, ఎం.అనూష, జి.విజయ స్వప్న, సిరాజున్నీసా, వి.శివకుమారి లు ఎంపికయ్యారు.



# పురాతన బావిని పూడ్చివేసి అక్రమ నిర్మాణం చేశారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

**పామర్రు మేజర్ న్యూస్ :** ప్రజా అవసరాల కోసం ఎన్నో ఏళ్ల క్రితంఏర్పాటు చేసిన పురాతన బావిని పూడ్చి వేసి ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కలెక్టర్‌కు అందించిన వినతిపత్రం వివరాలను ఫిర్యాదుదారుడైన గుంటూరు దినకర్ స్థానిక విలేకరులకు అందించారు. ఇందుకు సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండల కేంద్రమైన పామర్రు లోని బాపూజీ పేటలో జమ్మిచెట్టుకు పోవు రోడ్ లో బందుల దొడ్డి బజార్ వద్ద గ్రామ ప్రజల నీటి అవసరాలు తీర్చే నిమిత్తం పామర్రు గ్రామపంచాయతీ నిధులతో పురాతన కాలంలో మంచినీటి బావిని ఏర్పాటు చేశారు. ఈ బావి ఎంతోమంది ప్రజల దాహార్తిని, నీటి అవసరాలను తీర్చిందని, అటువంటి బావిని పామర్రు గ్రామానికి చెందిన తాడిశెట్టి సత్యనారాయణ, అతని సోదరుడు తాడిశెట్టి మధుశేఖర్, తాడిశెట్టి విజయలక్ష్మి ముగ్గురు కలిసి అక్రమంగా పూడ్చివేశారని



ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజా అవసరాల కోసం పంచాయతీ స్థలంలో ఉన్న ఆ బావిని పూడ్చివేయటమే కాక ఆ స్థలానికి ఆనుకుని ఉన్న పంచాయతీ రోడ్డును కూడా ఆక్రమించి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మూడు అంతస్తుల భవనం కూడా ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. పంచాయతీ డోర్ నెంబర్ 30–7, 30–8, 30–9 నెంబర్లతో మూడంతస్తుల భవనాన్ని ఏర్పాటు చేసుకుని, రహదారిని కూడా ఇరుకుగా చేశారని పేర్కొన్నారు. ఇదేమని అడిగిన వారిపై దౌర్జన్యం చేస్తూ అధికారులను బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విధంగా ప్రజా అవసరాలు కోసం ఏర్పాటు చేసిన అతి పురాతన బావిని అక్రమంగా పూడ్చి వేయడంతో పాటు పంచాయతీ దారిని కూడా ఆక్రమించి చట్టాలను ఉల్లంఘించిన వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో కోరారు. ఈ మేరకు గుంటూరు దినకర్ వినతి పత్రాన్ని ప్రజావేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు అందించగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ఘనంగా స్వర్గీయ మండలి శతజయంతి ఉత్సవాలు

**- పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన మండలి వెంకట్రామ్ - మాక్ అసెంబ్లీ స్టూడెంట్ ఎమ్మెల్యే విద్యార్థినికి సన్మానం**





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండలి వెంకటకృష్ణారావు సేవాభావంతో ఉప్పెన బాధిత దివిసీమకు ఆర్త జన బంధువుగా నిలిచారని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం స్థానిక వంతెన సెంటరులో కృష్ణారావు విగ్రహం వద్ద శ్రీకాకుళం కూటమి నాయకుల ఆధ్వర్యంలో శత జయంతి వేడుకలు నిర్వహించారు.మండలి విగ్రహానికి తాడికొండ చిన్నా, శ్రీకాకుళం డీసీ వైస్ చైర్మన్ సుగ్గన రాంబాబు, గ్రామ టీడీపీ అధ్యక్షులు దాసం రామకృష్ణ, ఉప సర్పంచ్ శీలం శ్రీనివాసరావు, కొండవీటి నానీ, మాదాసు వినయ్, కోన హరీష్, మాజీ ఉప సర్పంచ్ బీ.నాంజీ, మాజీ ఎంపీటీసీ ఆత్కూరి సీతారామయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాడికొండ చిన్నా ఆధ్వర్యంలో రూ.12వేలు వ్యయంతో వంద మందికి పైగా నిరుపేద ఎస్టీలు, యాచకులకు నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మాక్ అసెంబ్లీకి అవనిగడ్డ నియోజకవర్గం నుంచి స్టూడెంట్ ఎమ్మెల్యేగా హాజరైన చల్లపల్లి బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల టెన్త్ విద్యార్థిని దీకొల్లు పల్లవిని మండలి వెంకట్రామ్ సత్కరించారు. పల్లవికి తాడికొండ చిన్నా రూ.2,500 నగదు బహుమతి అందచేశారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు,ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి చిన్నా, మాదివాడ రత్నారావు, బచ్చు కృష్ణకుమారి విశ్వనాథ పల్లి పాం, కోటం నాయకులు పాల్గొన్నారు.

# స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు

**నాగాయలంక నవంబర్ 30 మేజర్ న్యూస్ :** దివిసీమ రత్నం మండల వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలలో భాగముగా ఆదివారం షిరిడి సాయిబాబా దేవస్థాన సమీపంలోని ఆ మహానుభావుడి విగ్రహానికి నాగాయలంక మండల గ్రామ వాస్తవ్యులు మండలి. వెంకట కృష్ణారావు అభిమానులు నివాళులర్పించి పూలమాల వేసి శ్రద్ధాంజిలి ఘటించినారు. ఈ సందర్భంగా తెలుగు భాష కొరకు, ఎటువంటి ఆడంబర కార్యక్రమాలు లేకుండా ఎటువంటి పూలమాల లు మెడలో ధరించకుండా కాలినడకన దివి ప్రాంత ప్రజల కష్టాలను తెలుసుకొనుచు అనునిత్యం ప్రజలలో మమేకమై ఉండే, మహానుభావుడి కార్యక్రమాలు తెలియపరుస్తూ ఆయన ఆశయాలకి అనుగునము గా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని వారు చేసినటువంటి సేవా కార్యక్రమాలను కొనియాడినారు. ఈ కార్యక్రమానికి నాగాయలంక జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బండ్రెడ్డి హరి మల్లికార్జున్ రేమాల.బాబురావు మర్రిపాలెం మాజీ సర్పంచ్ బండ్రెడ్డి బోసు నాగాయలంక మార్కెటింగ్ యార్ట్ సభ్యులు ఉప్పల ప్రసాద్ తాడేపల్లి వెంకట పాపారావు తలశిల. రాఘవరావు తానంకి చంటి రేమాలవారిపాలెం ఉపసర్పంచ్ పేర్ల భీమేశ్వరరావు నంగేగడ్డ వాస్తవ్యులు సనకా శేషు, చందన సుబ్బారావు భోగాది. సతీష్ మాదివాడ అర్జున్ రావు తలశిల రామకృష్ణ (చౌదరి మాస్టర్ ) తలశిల.శివశంకర్ షేక్ జానీ



బండ్రెడ్డి బోసు గుడివాడ శివరావు చెన్నగిరి లతా మోహన్ పెద్దలు మండలి వెంకట క్రిష్ణారావు అభిమాన సంఘం సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు.

# హనుమంతరావు సేవలు మరువలేనివి



**మొవ్వ మేజర్ న్యూస్ :** కూచిపూడి లోని శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థాన సలహా మండలి కమిటీ చైర్మన్ డాక్టర్ ఏలేశ్వరపు హనుమంతరావు సేవలుమరువరానివని ముఖ్యంగా కళ్యాణమండపం నిర్మాణంలో ఆయన కీలకపాత్ర వహించి పేద వర్గాలకు అండగానిలబడ్డారనివక్తలు పేర్కొన్నారు.ఈనెల 15వ తారీఖు కన్నుమూసిన హనుమంతరావు సంతాప సభను ఆదివారం శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయ పాలకమండలి ఆధ్వర్యంలో కూచిపూడి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కృష్ణా జిల్లాపద్మశాలియ సంఘ అధ్యక్షులు కొండవీటి అమరబాలేశ్వరరావువిచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఆయన గురించి ప్రసంగించి నివాళు లర్పించారు. పాలక మండలి అధ్యక్షుడు కావూరి భానుమూర్తి అధ్యక్షతన సాగిన సంతాప సభలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు వేదాంతం వెంకట శివయ్య, నాట్య కళా పీఠం విశ్రాంత ప్రధాన ఆచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, గురుకుల పాఠశాల విశ్రాంత ప్రధాన ఆచార్యులు పసుమర్తి మురళీకృష్ణ, పాలక మండలి సభ్యులు భాగవతుల సీతారామారావు, సివిల్ సప్లైస్ విశ్రాంతి అధికారి ఏలేశ్వరపు రామకృష్ణ, దేవస్థానం ఉపాధ్యక్షులు పసుమర్తి నారాయణమూర్తి, తదితరులు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు కుమారులు ఏలేశ్వరపు కృష్ణ చైతన్య, శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు టౌన్ లోని పలువురికి ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను స్థానిక శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా ఆదివారం ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. పామర్రు టౌన్ లో పెందుర్తి భువనేశ్వరికి 24,866 రూపాయలు, సమ్మంగి శ్రీనివాసరావు కు 88,729 రూపాయలు, ముంగండి పార్వతికి 42,205 రూపాయలు, పరసా లక్ష్మయ్య కు 37,710 రూపాయలు వంతున ఆర్థిక సహాయం మంజూరు కాగా ఆ చెక్కులను కుమార్ రాజా స్వయంగా వారి ఇళ్ళకు వెళ్లి లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన బాధితులతో మాట్లాడి ప్రస్తుత వారి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు చాట్ల రమేష్, పానుగంటి సందీప్, మంతెన రామాంజనేయులు, పరసా సుబ్రహ్మణ్యం, మండపాక శంకర్ బాబు, వీరంకి వెంకటేశ్వరరావు లతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు టార్పాలిన్లు పంపిణీ



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** దిత్వా తుఫాన్ నుండి వరిపంట రాశులు, వరికుప్పలను రక్షిం చుకునేందుకు రైతులకు పట్టాలను పంపిణీ చేశారు. చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 320 టార్పాలిన్ పట్టాలను రైతులు ఉపయోగించుకుని తిరిగి ఇచ్చేలా వారికి అందచేశారు. మొవ్వ ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఏవో కె.మురళీకృష్ణ, ఆర్ఎ ఘం టసాల కృష్ణమోహన్, వీఆర్వోలు ఎం.ప్రశాంత్, పెనుమూడి. వెంకటేశ్వరరావు, సొసైటీ సీఈవో పుట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. మేకావారిపాలెం సొసైటీ పరిధిలో రైతులకు టార్పాలిన్లను చైర్పర్సన్ గుత్తికొండ వంశీకృష్ణ చేతులమీదుగా అందచేశారు.

## కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



**పామర్రు మేజర్ న్యూస్ :** కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జనతా పార్టీ మండల అధ్యక్షులు ముదునూరు శివకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం పామర్రులోని హితం పబ్లిక్ స్కూల్లో మండల పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శివకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి అవగాహన కల్పించడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నామినేటెడ్ పదవులు పొందిన ఏఎంసీ డైరెక్టర్, దేవాలయ ధర్మకర్త, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా పనిచేయాలి



**కొండపల్లి మేజర్ న్యూస్ :** కొం డపల్లి మున్సిపాలిటీలో కొత్తగా ఏర్పాటు చేసిన ఈలప్రోలు సబ్స్టేషన్లో పర్యావరణ పరిరక్షణ తమ ధ్యేయమని వాతావరణ కాలుష్యం లేకుండా చూడడం ప్రతి ఒక్కరు బాధ్యతని కొండపల్లి ఏఈ పవిత్ర రాణి పిలుపునిచ్చారు. సబ్ స్టేషన్లో మొక్కలు నాటి నిత్యం వాటిని పర్యవేక్షించాలని వాటి ఎదుగుదలకు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ డి రవిబాబు ఫోర్ మెన్ వి రామకృష్ణ లైన్మెన్ పి.శ్రీనివాసరావు, సబ్ స్టేషన్ ఆపరేటర్లు ఇతర సిబ్బంది పాల్గొని మొక్కలు నాటి విజయవంతం చేశారు. అందరికి మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తామని ఆమె తెలిపారు.

# ఏపీ కో ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా టి.వి.ఫణి పేర్రాజు, ప్రధాన కార్యదర్శిగా జి.సురేష్ నాయుడు ఎన్నిక

## ఏపీ కో ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా 6 వసారి ఎన్నికైన టి.వి.ఫణి పేర్రాజు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** సహకార శాఖ ఉద్యోగుల సంఘం ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర మహాజన సభ ఆదివారం విజయవాడ రెవెన్యూ భవన్లో జరిగినది. టి వి ఫణిపెర్రాజు అధ్యక్షుడిగా జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల సమావేశంలో తొలిసారిగా నలుపు రంగు ప్యాంటు, తెలుపు చొక్కాలతో ఏకరూప దుస్తులతో అన్ని జిల్లాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదర్ వివిధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు అతిథులుగా హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు సూర్యాపేటలో ఉన్న సహకార భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ఎన్నికకు గాను నామినేషన్లు దాఖలు చేసిన పిదప రెవెన్యూ భవన్‌లో జరిగిన మహాజన సభ లో పాల్గొని ఉన్నారు. ఈ సందర్భంగా టీవీ పని పేర్రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తించి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో సభ్యుడిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ గత 56 సంవత్సరాలుగా క్రమ శిక్షణకు మారుపేరుగా నడుస్తున్నదని, నవంబర్ నెలలోనే 25 జిల్లాలకు ఎన్నికలు నిర్వహించుకుని రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా ఎన్నికలు నిర్వహించి ఉన్నామని ఆరవసారి నేను అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్నానని గత 16 సంవత్సరాలుగా అధ్యక్షుడిగా ఉంటూ మరొకసారి నన్ను ఎన్నుకున్న సహకార ఉద్యోగులకు మన మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తూ మరింత బాధ్యతగా పనిచే స్తానని తెలియజేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం చేస్తున్న ప్రయత్నాలను స్వాగతిస్తూ తెలుపు రంగు చొక్కాను ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల యొక్క అన్ని సమస్యల త్వరితగతిన పరిష్కరిస్తూ బకాయిలను వెంటనే చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ నలుపు రంగు ప్యాంటును వేసుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులందరూ ఈరోజు సమావేశానికి హాజరయ్యారని తెలియజేశారు. అదేవిధంగా సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పారదర్శకంగా ఉద్యోగులకు సర్వీసులు అందించాలని ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ మా ప్రమోషన్లు,బదిలీల సమయంలో చక్కటి సహకారాన్ని అందించినందుకు సభాపూర్వకంగా వారికి ధన్యవాదాలు తెలియజేశారు. సహకార శాఖ కమిషనర్ బాబు ఏ ఐ ఏ ఎస్ వారు ఈ సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా సహకార ఉద్యోగులకు ఇచ్చిన పదోన్నతులలో 100% మంది తృప్తిపడేలా పోస్టింగులు ఇవ్వడమే కాకుండా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత అంశంగా భావించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరైజేషన్ను పూర్తి చేయడానికి డిపార్ట్మెంట్లో ఉద్యోగుల యొక్క సేవలను, సమయాన్ని 100% ఉపయోగించుకుని దేశీవ్యాప్తంగా మొదటి స్థానంలో నిలబెట్టినందుకు వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యఅతిథి బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన టీవీ ఫణి పేర్రాజు, జి.సురేష్ నాయుడులను అభినందిస్తూ, కోపరేటివ్ సర్వీస్ అసోసియేషన్‌తో దశాబ్దాలుగా నాకు అనుబంధం ఉందని అసోసియేషన్ నాయకత్వం, సభ్యులంతా ఒకే మాట మీద వ్యవహరిస్తారని సమిష్టితత్వంతో అవగాహనతో వారి సమస్యలు పరిష్కారానికి వారి ప్రయత్నిస్తారని, అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతితో చేసిన ఉద్యమాల్లో ప్రధానమైన పాత్రధారులుగా ఉన్నారని తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి జి సురేష్ నాయుడు మాట్లాడుతూ ఒకే నెలలో అటు జిల్లాలకు ఎటు రాష్ట్ర స్థాయిలోనూ ఎన్నికలు సజావుగా జరగడానికి సహకరించిన సహకార శాఖ ఉద్యోగులందరికీ, అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. సహకార శాఖ ఉద్యోగులకు అత్యంత ప్రధానమైన శిక్షణా తరగతులు నిర్వహించడం, ప్రతి నెలలో పది పదిహేను శాతం ప్రయాణ ఖర్చులు జీతాల నుంచి భరిస్తున్న ఉద్యోగులకు టీఏ బిల్లులు చెల్లింపు ప్రధానాంశాలుగా ఇతర సమస్యలన్నీ కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్లి త్వరలో పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని తెలియజేశారు.

### జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైన సభ్యుల వివరాలు...

అధ్యక్షుడు: టీవీ ఫణి పేర్రాజు (డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా), ప్రధాన కార్యదర్శి జి సురేష్ నాయుడు (గుంటూరు), కోశాధికారి జి సి బి వి కోటేశ్వరరావు ( ఎస్పీఎస్ నెల్లూరు), సహ అధ్యక్షుడు : పి నాగ రమణయ్య (కర్నూలు), ఆర్గనైజింగ్ సెక్రటరీ: కె రవిశంకర్ (శ్రీకాకుళం), ఉపాధ్యక్షులుగా: ఎస్ శ్రీనివాసులు రెడ్డి (చిత్తూరు) డి విజయ్ కుమార్ (కృష్ణా) ఎం.వి.కొండారెడ్డి (అన్నమయ్య) పి. రాజశేఖర్ (ఎన్టీఆర్) ఎం రషీద్ అహ్మద్ (నంద్యాల) ఎన్ సురేంద్రబాబు (ప్రకాశం) ఎ. కె. ఎన్.ఎన్. మూర్తి (ఏలూరు) జీ.కే బాల గంగాధర్ (అనంతపురం) బి.శ్రీనివాస్ (అనకాపల్లి), జోనల్ కార్యదర్శులు: డిఏవి రామారావు (విశాఖపట్నం) పి దుర్గాప్రసాద్ (కాకినాడ) డి వాసు బాబు (గుంటూరు) కె మురళీమోహన్ వైయస్సార్ (కడప ), కార్యదర్శులు: (బి శివ శంకర్ నాయక్ (తిరుపతి) ఎస్ రామకృష్ణ (విజయనగరం) కూచి సుబ్బారావు (తూర్పుగోదావరి) ఎం.మోజస్ (బాపట్ల) కె.మధుబాబు (కోనసీమ) కె.ఫణి కుమార్ (పశ్చిమగోదావరి) జి.శ్రీనివాసరావు (కమిషనర్ కార్యాలయం), క్యాడర్ కార్యదర్శులు జూనియర్ ఇన్స్పెక్టర్: కె.సాయికిరణ్ (నెల్లూరు), జూనియర్ అసిస్టెంట్: జి మల్లికార్జునరావు (కమిషనర్ కార్యాలయం), టైపిస్ట్ : బి వి ఎస్ ఎస్ ప్రణీత్ వర్మ (విశాఖపట్నం).

## ఓటరు నమోదు కార్యక్రమం..



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని పి.నైనవరం గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటరు నమోదు కార్యక్రమం గ్రామం లో జనసేన నాయకులు నిర్వహించారు. చాలా మంది ఈ కార్యక్రమంలో యువకులు,స్త్రీలు,పెద్ద సంఖ్యలో ఆదివారం గ్రామ పంచాయతీ దగ్గరకు వచ్చి ఓటు నమోదు చేసుకున్నారు.జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల నాగరాజు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలి అనుకునే వారు గ్రామ నైనవరం పంచాయతీ వద్దకు వచ్చి నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నైనవరం గ్రామ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని అలినఖిపాలెం గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ గత నెల రోజులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు పామర్రు మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర అధికార ప్రతినిది కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మీర్జా సజాద్ అలీ, మిర్జా పర్హత్ అబ్బాస్, వైఎస్సార్సీపీ గ్రామ కన్వీనర్ ఖయ్యూం అలీ, బూత్ కన్వీనర్ అబ్బాస్ అలీ, మైనార్టీ కన్వీనర్ షాహిద్ అలీ, మాజీ కన్వీనర్ మన్సూర్ అలీ, హైదర్ అలీ పాల్గొన్నారు.

# ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా కాజా రాజకుమార్ ఎన్నిక



**విజయవాడ, మేజర్ న్యూస్ :** మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం బాలత్సవ భవన్ విజయవాడ లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఖజానా, లెక్కల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర రెండవ కార్యవర్గ సమావేశము నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 19 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరైనారు. ఈ కార్యక్రమానికి ఏ.పి.జి.ఈ.ఎ. రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. సూర్యనారాయణ ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. ఈ సమావేశములో రాష్ట్ర అధ్యక్షుడుగా కె. రాజ కుమార్ ని ఎకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది., గౌరవ అధ్యక్షులుగా శ్రీ.జి.రవికుమార్, బి.శ్రీనివాసరావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీగా, డి. కృష్ణంరాజు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, కె.వి. సురేష్ బాబు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కో ఆప్షన్ చేసుకోవటం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు కె.రాజ్ కుమార్ అధ్యక్షోపన్యాసము చేస్తూ ఖజానా శాఖలో సహాయ ఖజానాధికారి నుండి అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్ నుండి డిప్యూటీ డైరెక్టర్ పదోన్నతుల విషయంలో తీవ్రమైన జ్యాప్యాన్ని ఆయన ఆక్షేపించారు. పదోన్నతులకు పూర్తిగా అర్హత ఉన్న మన శాఖ అధికారులు అనేకమంది పదవీ విరమణ చేయుచున్న నేపథ్యంలో ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పదోన్నతుల విషయంలో చొరవ చూపి పదోన్నతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయవలసినదిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఖజానా శాఖలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు డిసిప్లినరీ కేసులపై ఆర్థిక శాఖ ప్రత్యేక దృష్టిని సారించి, మన సంఘం ప్రభుత్వానికి సమర్పించిన ఎల్ఆర్.నెం./ఏపిటిఏఎస్ఏ/2025, తేది 04-02-2025లో పేరా 9లో అభ్యర్థించిన విధంగా 2025-2026 ప్యానల్ ఇయర్లోపుగా అన్ని డిసిప్లినరీ కేసులు పరిష్కరించవలసిదిగా ఆర్థికశాఖ ఉన్నతాధికారులకు, సంచాలకులు ఖజానా, లెక్కల శాఖ వారికి విజ్ఞప్తి చేశారు. ఖజానా శాఖలో అడహాక్ పదోన్నతులు పొందిన జూనియర్ అకౌంటెంట్/షరాబులకు సుదీర్ఘకాలంగా రెగ్యులరైజేషన్/ప్రొబేషన్ కాక, పూర్తి అర్హతలు ఉన్నప్పటికీ పదోన్నతులు పొందక, వారు తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనౌతున్న నేపథ్యంలో మన సంఘం ఎల్ఆర్.నెం./ఏపిటిఏఎస్ఏ/2025, తేది 04-02-2025 ద్వారా సూచించిన విధంగా జి.వో.ఎంఎస్.నెం 22కు మాడిఫికేషన్ ఉత్తర్వులను ఇచ్చి ఖజానా శాఖలో బర్నింగ్ ఇష్యూగా ఉన్న ఈ సమస్యకు చరమ గీతం పాడవలసినదిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గౌరవ సుప్రీంకోర్టు ఎస్ఎల్పి (1)నెం.5234/2025(సి.ఏ.నెం.10679/2025) కేసులో ప్రకాశంజిల్లాలోని స్థానిక సంస్థలలో పనిచేస్తూ చనిపోయిన వారి పిల్లలకు కారుణ్యనియామకం కింద ట్రెజరీ శాఖలో నియమింపబడిన ఇద్దరు ఉద్యోగులకు ఇచ్చిన ఆదేశాల విధంగా రాష్ట్రంలోని మిగతా ఉద్యోగులకు కూడా సర్వీసు క్రమబద్ధీకరించి పదోన్నోతి కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏ.పి.జి.ఈ.ఎ. రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. సూర్యనారాయణ ప్రసంగిస్తూ ఆపరిష్కృతంగా ఉన్న ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించి గత 5 సంవత్సరాలుగా పెండింగులో ఉన్న ఆర్థిక /ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు త్వరిత గతిన చేరువ చేయుటలో ప్రభుత్వ ఉద్యోగులదే కీలక పాత్ర, అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు వారధిలా పనిచేసే ఉద్యోగ వర్గాన్ని ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమముగా భావించి, ఉద్యోగుల మనోభవాలుకు తగ్గట్లుగా వారికి న్యాయపరంగా రావలసిన ప్రయోజనాలను తక్షణమే అమలు చేసే విధంగా చర్యలు గైకోనవలసినదిగా ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఖజానా శాఖలో అపరిష్కృతముగా ఉన్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి గత 3 నెలల కాలములో తెలియజేశామని. ప్రభుత్వం పలు సమస్యల పరిష్కారానికి త్వరలో మార్గదర్శకాలు జారీ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశములో ఏ.పి.జి.ఎ.ప్రధాన కార్యదర్శి జి. రమేష్ కుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.నాగసాయి, ఏ.పి.టి.ఎ.యస్.ఎ. గౌరవ అధ్యక్షులు శ్రీ.జి.రవికుమార్, రాష్ట్ర సహాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ బి. శ్రీనివాసరావు, కోశాధికారి యల్.వి. యుగంధర్, కార్య నిర్వాహక కార్యదర్శి డి. కృష్ణంరాజు, ఉపాధ్యక్షులు మజహార్ బేగ్, కరీముల్లా, హాసీనా బేగం, కె.వి. సురేష్, అబ్దుల్ ఖాదర్, ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఖజానా శాఖలో సభ్యులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘ చర్చల అనంతరం రాష్ట్ర కార్యవర్గం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించడమైనది.



# అధికారుల మన్ననలు పొందిన వ్యక్తి వెంకటేశ్వరరావు





**చల్లపల్లి మేజర్ న్యూస్ :** విధి నిర్వహణలో అధికారుల, ప్రజా ప్రతినిధుల మన్ననలు పొందిన వ్యక్తి పోతుమూడి వెంకటేశ్వరరావు అని పలువురు వక్తలు అభినందించారు. గత 42 సంవత్సరాలుగా పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్లో పనిచేసి మండల పరిషత్ కార్యాలయం అటెండర్ గా పదవి విరమణ చేసిన సందర్భంగా పలువురు ప్రముఖులు వెంకటేశ్వరరావు దంపతులను పూల మాల లతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయరాధికా మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వ్యక్తులు అధికారులకు, ప్రజలకు చిరస్థాయిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ ఎం ఎం ఆనంద కుమారి,సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కో ఆప్షన్ సభ్యులు షేక్ నబీ ఘోరీ, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, పంచాయితీ కార్యదర్శి పివి మాధవేంద్రరావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు, చల్లపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు పి. మధుసూదన్ రెడ్డి, ఎస్. ఏ. అహ్మద్, నడకుదురు లీలా బ్రహ్మేంద్ర, ఆకుల సుధీర్, బెల్లంకొండ హరిప్రసాద్, పెనుముడి శ్రీనివాసరావు బళ్ల మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్కూల్ గేమ్స్ అండర్ - 17 రగ్బీకి చింతల స్వప్న కుమారి ఎంపిక



**గన్నవరం, నవంబర్ 30, మేజర్ న్యూస్ :** ఈ నెల 28, 29 తేదీలలో నెల్లూరు జిల్లా పొదలకూరులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల రగ్బీ పోటీలులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వీరపనేనిగూడెం విద్యార్థిని చింతల స్వప్న కుమారి ఉత్తమ ప్రతిభను కనబర్చి, డిసెంబర్ రెండో వారంలో భువనేశ్వర్లో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 రగ్బీ పోటీలుకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. వెంకటేశ్వరావు తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సాధనకు ఆమెకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు సిహెచ్ బాలకృష్ణను, అలాగే విద్యార్థిని చింతల స్వప్న కుమారిని ఉపాధ్యాయ బృందం, సహ విద్యార్థులు, గ్రామస్తులు హర్షాతిరేకాలతో అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా ఆమె ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి పాఠశాలకూ గ్రామానికీ గర్వకారణంగా నిలవాలని వారు ఆకాంక్షించారు.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే వసంత పరామర్శ



**మైలవరం మేజర్ న్యూస్ :** మైలవరం పట్టణంలో ఇటీవల మృతి చెందిన ఇరువురు కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం పరామర్శించారు. టీడీపీ నాయకులు, మైలవరం మాజీ ఎంపీటీసీ యర్రంశెట్టి కన్నారావు, బండి వెంకట కృష్ణరామారావు ఇటీవల మృతి చెందారు. వీరిరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమం



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించు కొని డిసెంబర్ 1 సోమవారం ఉదయం 9.30గంటల నుండి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాలను నగరంలోని స్థానిక తుమ్మలపల్లి కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా హెచ్ఐవి/ఎయిడ్స్పై అవగాహన కల్పించడం, అలాగే ప్రపంచవ్యాప్తంగా ఏకత్వం, సంఘీభావాన్ని ప్రదర్శించడం కార్యక్రమ లక్ష్యం అన్నారు. ఈ కార్య క్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ & మెడికల్ ఎడ్యుకేషన్ శాఖ మంత్రి, సత్య కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నార న్నారు. ఆ శాఖ ప్రధాన కార్యదర్శి సౌరబ్ గౌర్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, మిషన్ డైరెక్టర్ (ఎన్ఎచ్ఎం) జి వీర పాండ్యన్, డైరెక్టర్ సెకండరీ హెల్త్ కేబీఎన్ చక్రధర బాబు, జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశా, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారని తెలిపారు.

**అవగాహన ర్యాలీ.....** ఉదయం 9 గంటలకు విజయవాడలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి (ఓల్డ్ జిజిహెచ్) నుండి "తుమ్మలపల్లి కళాక్షేత్రం" వరకు ప్రారంభమయ్యే ర్యాలీని మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్, శాసనసభ్యులు ఇతర అధికారులు ప్రారంభించనున్నారని తెలిపారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధికారులు ఆ ప్రకటనలో తెలిపారు.

# శ్రీకొండలమ్మ సన్నిధిలో 10వేల మంది భక్తుల మొక్కుబడులు







**గుడ్లవల్లేరు నవంబరు 30 మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అగుట వలన భక్తులు అధిక సంఖ్యలో షుమారు 10000 మంది భక్తులు శ్రీ అమ్మవారిని ధర్శించుకోని తమ మ్రొక్కుబడులు సమర్పించినారు. మహిళా భక్తులు శ్రీ అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించినారు. దేవస్థానము పరిసర ప్రాంతములు శుభ్రము చేయించి బ్లీచింగ్ చల్లించడమైనది. శ్రీ అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ పర్యవేక్షించినారు. అని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు తెలియజేసియున్నారు.

## సీఎంని కలిసిన తెలుగు యువత అధ్యక్షులు విజయ్



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అవనిగడ్డ నియోజక వర్గం టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు మేడికొండ విజయ్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆదివారం తెలిపారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో శనివారం సాయంత్రం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి అవనిగడ్డ నియోజకవర్గంలో తెలుగు యువతకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు విజయ్ తెలిపారు.

## నాగభూషణం మృతికి శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యే



**మైలవరం మేజర్ న్యూస్ :** మైలవరం మండలంలోని బొర్రగూడెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం ఆలయ పూజారి జాజుల నాగభూషణం ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం బొర్రగూడెం గ్రామానికి విచ్చేసి ఆయన చిత్రపటానికి పుష్పములు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కోటి సంతకాల సేకరణలో వైఎస్సార్ యూత్



**గుడ్లవల్లేరు నవంబరు 30 మేజర్ న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు గుడివాడ మాజీ మంత్రి కొడాలి నాని ఆదేశాల మేరకు పార్టీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలేటి చంటి, గుడ్లవల్లేరు మండలం పార్టీ అధ్యక్షుడు సాయన రవి సూచనల మేరకు గుడ్లవల్లేరు మండలం యువజన విభాగం అధ్యక్షుడు గుదే రవి ఆధ్వర్యంలో యువజన విభాగం తరుపున కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడ్లవలేరు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కృష్ణా జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మిరియాల బాబు రాజేంద్ర ప్రసాద్, గుడివాడ నియోజక వర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుంచపర్తి సాయి, ఐటీ విభాగం అధ్యక్షుడు కుందేటి ఫణి, ఎస్సీ సెల్ చేబత్తిన నందీశ్వరరావు, సింగవరపు వెంకట్రావు, సుధీర్,బద్దె వినోద్ కుమార్, బొడ్డు వినోద్ కుమార్, పసల శ్రీను, మద్దాల అరుణ్ కుమార్, తేరా కెన్నీ, గోట్రూ వంశీ, కాటూరి మెర్సీ, జజ్జువరపు నాగరాజు, కంచర్ల కోటి, మందపాటి విజయ్ కుమార్, ఇలపర్తి లక్ష్మణరావు, నత్త వినోద్ కుమార్, అనగాని నాగరాజు, షేక్ భాషా,నజీర్, మధిరి నాని తదితరులు పాల్గొన్నారు.

## జయప్రసాద్ మరణం పార్టీకి లోటు



**గన్నవరం (ఉంగుటూరు ), నవంబర్ 30 మేజర్ న్యూస్ :** ఉంగుటూరు మండలం ఆముదాలపల్లి గ్రామానికి చెందిన దాసరి జయప్రసాదరావు మరణం తెలుగుదేశం పార్టీకి తీరనిలోటని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. జయప్రసాద్ సంస్మరణ కార్యక్రమం ఆదివారం అముదాలపల్లిలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన యార్లగడ్డ జయప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పని చేసిన ప్రసద్ పార్టీ పటిష్టతకు కృషి చేసారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని అందరూ పనిచేయాలని యార్లగడ్డ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుటుంబ సభ్యులను పరమర్శించి ప్రగాఢ సానుభూతి ని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బలవర్ధనరావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఉంగుటూరు మండల నీటి పారుదల సంఘం ప్రెసిడెంట్ దాసరి శ్రీకృష్ణ తండ్రి దాసరి వెంకటేశ్వరరావు మృతి చెందగా పార్థివదేహాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# పొట్టి శ్రీరాములు పాఠశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



## శ్రీరామ్ ఫైనాన్స్ సి.ఎస్.ఆర్. నిధులతో చేపట్టు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ హై స్కూల్ ఆవరణలోని క్రీడా మైదానంతో పాటుగా పాఠశాలలోని అన్ని సౌకర్యాలను కల్పించి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని కృష్ణలంకలోని, పొట్టి శ్రీరాములు హైస్కూల్లో అభివృద్ధి పనులకు గాను శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ వారు సి.ఎస్.ఆర్. క్రింద విరాళముగా ఇచ్చిన రూ.35 లక్షలతో చేపట్టనున్న పనులపై ఆదివారం ఉదయం శాసనసభ్యులు గద్దె రామ మోహన్ అధికారులు, స్థానికులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ఈ ప్రాంతవాసులకు ఉపయోగకరంగా ఉండాలని ప్రాథమిక పాఠశాల, హైస్కూల్, జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 2014-19వ సంవత్సరంలో అన్న నందమూరి తారక రామారావు పేరుతో క్రీడా మైదానాన్ని కూడా నిర్మాణం చేయించినట్లు గుర్తుచేశారు. ఈ స్కూల్ చుట్టూ ప్రహరీ గోడ, స్కూలు ప్రాంగణం అభివృద్ధి నిమిత్తం అవసరమయ్యే నిధులను సమకూర్చాల్సిందిగా తాను శ్రీరామ్ ఫైనాన్స్ వారిని కోరగా వారు వెంటనే స్పందించి సీఎస్ఆర్ ఫండ్స్ క్రింద రూ.35లక్షల చెక్కును జిల్లా కలెక్టర్‌కు అందచేశారని వివరించారు. జిల్లా కలెక్టర్ ఆ నిధులను మున్సిపల్ కమీషనర్‌కు అందచేశారన్నారు. మున్సిపల్ కమీషనర్ అంచనాల సిద్ధం చేసి పనులు ప్రారంభిస్తారని చెప్పారు. పాఠశాల మొత్తాన్ని ఆహ్లాదకరమైన వాతావరణం కలిగేలా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రౌండ్‌ను క్రికెట్ స్టేడియంగా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమని గద్దె రామమోహన్ తెలిపారు. ఈ విషయాన్ని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ దృష్టికి కూడా తాను తీసుకువెళ్ళానని చెప్పారు. స్టేడియంగా అభివృద్ధికి అంచనాలు రూపొందించి అందచేస్తే పరిశీలిస్తానని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇక్కడ నిత్యం సుమారు 500 మంది వాకింగ్ చేస్తుంటారని చెప్పారు. ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లోని మైదానాల్లో ఉదయం 4 నుంచి 6 గంటల వరకు వాకింగ్‌కు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులను కోరారు. కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు హైస్కూల్‌ను, క్రీడా మైదానాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. శ్రీరామ్స్ కంపెనీ ప్రతినిధి నాగేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తమను కోరడంతో వెంటనే తమ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్స్, ఇతర అధికారులైన వెంకటేశ్వరరావు లాంటి వారి దృష్టికి తీసుకువెళ్ళి వారి అనుమతితో రూ.35లక్షలను సీఎస్ఆర్ ఫండ్స్ కింద స్కూల్ అభివృద్ధికి విరాళంగా ఇచ్చినట్లు వెల్లడించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ కంపెనీని భాగస్వామ్యం చేసినందుకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సామాజిక సేవా కార్యక్రమం చేయించిన ఘనత అంతా ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గొరిపర్తి నాగేశ్వరరావు, కొర్ర అప్పన్న, కొడాలి సోమేశ్వరరావు, వేములపల్లి రంగారావు, కొవ్వూరి కిరణ్, గుండు శ్రీను, మోటేపల్లి చిన్నా, కేశనం శివభావన్నారాయణ, నిమ్మల జ్యోతిక, వెన్నా శంకర్, నిమ్మల దుర్గారావు, తాడువాయి సత్యనారాయణ, గల్లా శ్రీను, గద్దె రమేష్, కార్పొరేషన్ ఈఈ సామ్రాజ్యం, శ్రీరామ్స్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, జి.గోపాల్, సయ్యద్ ఉస్మాన్, కె.సతీష్, స్థానిక వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మైదాన ప్రాంత గిరిజనుల హక్కుల సాధనకై ఉద్యమిద్దాం



### గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి.

### గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలి

### జిపిఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా మచిలీపట్నంలో గిరిజనుల ఆత్మీయ ముఖ్య నేతల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి, ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేరిస్తే ఒప్పుకునేది లేదు.. మచిలీపట్నం రౌండ్ టేబుల్ సమావేశంలో గిరిజన సంఘాల నేతల తీర్మానం, మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, రాష్ట్రంలో ఉన్న గిరిజనులు హక్కుల సాధనకై ఉద్యమించాలని, గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు.మచిలీపట్నం ఎన్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం గిరిజన ప్రజా సమాఖ్య, విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. వివిధ గిరిజన సంఘాల ముఖ్య నాయకులతో, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షుడు మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. దేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్న నేటికీ రాష్ట్రంలోని లక్షలాదిమంది గిరిజనులకు కనీసం కూడు, గూడు, నీడ లేక పరితపిస్తున్నారని, ఇప్పటికీ రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేక దుర్భరమైన జీవితాలు జీవిస్తున్నారని అన్నారు. నేటికీ ఆధార్ కార్డు లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ ఫలాలకు దూరం అవుతున్నారని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా గిరిజన జాతి అభివృద్ధికి ప్రతి ఏటా ప్రభుత్వాలు కేటాయించే కోట్లాది రూపాయలు నిధులను దారి మళ్లించకుండా వినియోగించబడాలంటే చట్టసభలలో గిరిజనుల తరఫున ప్రాతినిత్యం వహించే వ్యక్తి ఉండాలన్నారు. అందుకొరకై మన హక్కుల సంరక్షణ కొరకై సంకటితంగా మనమంతా కలిసికట్టుగా ఐక్యమత్యంతో ఉద్యమించాలన్నారు. ఎస్టీలో ప్రధానంగా సుగాలి, చెంచు, ఎరుకల, యానాది నక్కల ఇలా అనేక జాతులు ఉన్నారన్నారు వీరందరికీ సరైన సమాన ప్రాతినిధ్యం లేదన్నారు. రాష్ట్రంలోని గిరిజనులకు రాజకీయంగా మన్యం ప్రాంతాలకు పరిమితం చేయటం వలన మైదాన ప్రాంత గిరిజనులకు గత 58 సంవత్సరాలుగా జరగవలసిన అన్యాయం భారీగా జరిగిపోయిందన్నారు. ఇకనైనా మేలుకొని మన హక్కులను కాపాడుకునేందుకు కృషి చేయాలన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనను తీసుకోరావటం చాలా బాధాకరంగా ఉందన్నారు. అభివృద్ధికి నోచక ఇప్పటికీ దిక్కులేని స్థితిలో గిరిజన ప్రజానీకం జీవిస్తున్నారనే విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రహించాలన్నారు.


1962 నుండి 67 వరకు చట్టసభలకు నిర్వహించిన ఎన్నికల్లో జిల్లాలను ఒక యూనిట్గా తీసుకొని రిజర్వేషన్ అందించడం వలన మైదాన ప్రాంతాల్లో అప్పటి ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉండేది. మైదాన ప్రాంతాల్లో కదిరి, కావలి, మాచర్ల, జగ్గయ్యపేట నాలుగు అసెంబ్లీ స్థానాలకు రిజర్వేషన్ కల్పించి చట్టసభలో ప్రాతినిధ్యం వహించారు కానీ 1967లో ప్రభుత్వ పాలన విధానాల్లో జరిగిన మార్పుల వలన జిల్లా యూనిట్ తీసుకోకుండా రాష్ట్ర యూనిట్ గా తీసుకోవడం వలన ఏజెన్సీ ప్రాంతాలకి మాత్రమే గిరిజన రిజర్వేషన్ పరిమితమయ్యాయి. అలా చేయడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 2026 సంవత్సరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో శాసనసభ స్థానాలు 175 నుంచి 225 పెంపునకు కొత్తగా ఏర్పాటు కానున్న ఆ నియోజకవర్గాలలో రాష్ట్ర జనాభాలో సగ భాగంగా ఉన్న మైదాన ప్రాంత గిరిజనులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాలలో ప్రాతినిత్యం లభించేలా మనమందరం పోరాడవలసిన సమయం ఆసన్నమైందన్నారు. జాతి భవిష్యత్తు కోసం, అభ్యున్నతి కోసం, జాతీ వెలుగు కోసం, ఉద్యమ బాట మొదలుపెట్టి ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని ప్రతి గిరిజన ప్రాంతాల్లో చేరేలా ప్రతి ఒక్క గిరిజనుడు కృషి చేయాలన్నారు.అనంతరం రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘం నాయకులంతా సంఘీభావం తెలిపారు ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, కార్పొరేటర్ యాకసిరి వెంకటేశ్వరరావు, గిరిజన నేతలు పద్మరాజు, రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, సుగాలి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్, సాలా నాగరాజు, పాండు రంగారావు, కిరణ్, యువజన అధ్యక్షుడు హనుమంతు నాయక్, సత్యనారాయణ, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.



## రైతును రాజుగా చేయటమే ప్రభుత్వం లక్ష్యం

**పామర్రు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం వారోత్సవాలలో భాగంగా పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, అధికారులు మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు గ్రామాలలో రైతులను కలిసి ప్రభుత్వ అందిస్తున్న పథకాలను వివరించారు. మండల పరిధిలోని పెదమద్దాలి గ్రామంలో రైతన్నలను కలిసి ధాన్యం కోతలు, ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అవసరమగు సదుపాయాలు, ప్రభుత్వం అందిస్తున్న వివిధ ప్రోత్సాహ సంక్షేమ పథకాలు వివరించారు. మార్కెట్ యార్డ్‌లో గల గోడాములు రైతు బంధు పథకం కింద ధాన్యం నిలవ చేసుకుని రుణ సదుపాయం పొందవచ్చని రైతులకు తెలిపారు. అనంతరం ప్రచార కర పత్రాలను అన్నదాతలకు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శివరామకృష్ణ, ఏ.ఎం.యస్. యశస్వి, మార్కెట్ కమిటి సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ఆరుమళ్ళ అనిత, సజ్జా వెంకట నాగలక్ష్మి, ముదునూరి కమలకుమారి, పిఏసిఎస్ అధ్యక్షులు దేవరపల్లి రామ కోటేశ్వరరావు, కార్యదర్శి తోలేటి రవి సత్య ప్రసాద్, సొసైటీ సభ్యుడు మిక్కిలినేని శివప్రసాద్, వీఆర్వో, గ్రామ వ్యవసాయ సహాయకుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఆదిమూలపు వారి అన్నప్రాసన వేడుకల్లో ఎమ్మెల్యే వసంత



**మైలవరం మేజర్ న్యూస్ :** పట్టణానికి చెందిన ఆదిమూలపు నాగలక్ష్మి మనుమడి అన్నప్రాసన వేడుకల్లో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం పాల్గొన్నారు. వెల్లడంలోని పేరంటాలమ్మ గుడిలో జరిగిన ఈ వేడుకల్లో చిన్నారి అర్విత్ కుమార్‌ను ఆశీర్వదించి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999